ప్రజాశక్తి
గురువారం 7 నవంబర్ 2024
5
విజయనగరం



డిఎస్‌సి శిక్షణకు 10న స్క్రీనింగ్ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు డిఎస్‌సి ఉచిత శిక్షణ పొందేందుకు ఈనెల 10న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ డిడి రామానందం తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి 1.30 వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులు అరగంట ముందు హాజరు కావాలని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష హాల్ టికెట్ https://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడు చేసుకోవాలని తెలిపారు. గాజులరేగలోని సత్య ఇంజినీరింగ్ కళాశాల, ఎంవిజిఆర్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, చితలవలస, లెండి ఇంజినీరింగ్ కాలేజి, అవంతి ఇంజినీరింగ్ కాలేజీలో పరీక్ష జరుగుతుందని తెలిపారు.

డామిట్..! కథ అడ్డం తిరిగింది

- కోర్టులో వైసిపికి చుక్కెదురు
- ఎమ్మెల్సీ రఘురాజుకు ఊరట
- పదవిలో కొనసాగించాలని హైకోర్టు ఆదేశం



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కథ అడ్డం తిరిగింది. నోటిఫికేషన్ విడుదల, అభ్యర్థి ఖరారు తరువాత కోర్టులో ప్రతికూలంగా ఫలితం రావడంతో వైసిపికి ఎదురు దెబ్బ తగిలినట్లయ్యింది. దీంతో, వైసిపి అధిష్టానం మెదలుకుని జిల్లాలోని నాయకులు వరకు కంగుతిన్నారు. దీంతో ఎన్నికల నోటిఫికేషన్ రద్దు కావడం ఖాయమేనా? లేదా వైసిపి సుప్రీంకోర్టుకు వెళ్తుందా అనే చర్చ సర్వత్రా జరుగుతోంది. గత ప్రభుత్వంలో వైసిపి తరపున స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఇందుకూరి రఘురాజు ఎన్నికైన విషయం విధితమే. కాలపరిమితి ప్రకారం ఆయన 2027 నవంబర్ 31వరకు కొనసాగాల్సివుంది. కానీ, గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు సాగించారన్న అభియోగంతో అదే పార్టీకి చెందిన పాలవలస విక్రాంత్ శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో, శాసన మండలి చైర్మన్ అనర్హత వేటు విధించి ఈ ఏడాది జూన్ 2న డిస్మిస్ చేసిన సంగతి విధితమే. దీనిపై రఘురాజు అప్పట్లోనే కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆరువారాలపాటు స్టే విధించింది. ఈ విషయమై బుధవారం (ఈనెల 6న) కోర్టు తీర్పురావాల్సి ఉన్నప్పటికీ, 3వ తేదీనే ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి షెడ్యూల్ విడుదల చేసింది. వెంటనే కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలమునకలైంది. మరోవైపు నోటిఫికేషన్ జారీ కాగానే రఘురాజు మరోసారి కోర్టుకు అప్పీల్‌చేశారు. దీంతో, స్పందించిన న్యాయస్థానం ఎమ్మెల్సీగా రఘురాజును కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు నోటిఫికేషన్ నేపథ్యంలో అభ్యర్థి ఎంపిక కోసం వైసిపి ఎంతో కసరత్తు చేసింది. చివరికి బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి చినఅప్పల నాయుడికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విషయమై శంబంగి హుటాహుటీన విజయవాడ కూడా చేరుకున్నారు. మరోవైపు టిడిపికి సవాలుగా మారినప్పటికీ అభ్యర్థి కోసం వెతుకులాట ప్రారంభించింది. ఇటువంటి పరిస్థితుల్లో రఘురాజుకు అనుకూలంగా కోర్టు స్పందించడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. గెలుపు సవాలుగా మారిన నేపథ్యంలో టిడిపి తరపున సుప్రీం కోర్టుకు వెళ్లేందుకు సాహసిస్తారా? స్థానిక సంస్థలన్నీ వైసిపి చేతిలోనే ఉన్న నేపథ్యంలో మిన్నకుండిపోతారా? అన్నది వేచి చూడాల్సిందే.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, వసతి, విద్యా దీవెన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన బుధవారం విద్యార్థులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు నెలలుగా విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా విజయనగరం జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మాణం చేయాలని, మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పున ప్రారంభించాలని, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి కేటాయించిన స్థలంలో నిర్మాణం ప్రారంభించాలని, ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.3480కోట్ల స్కాలర్‌షిప్ నిధులు తక్షణమే విడుదల చేయాలని, ఈ సంవత్సరం నుంచే ఇంటర్ విద్యార్థులకు తల్లికి వందనం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాక జిల్లాలో ఉన్న సంక్షేమ హాస్టల్స్ లో మెస్ చార్జీలు పెంచాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ,మెడికల్ క్యాంపులు తరచుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి కి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అందించారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం దిశగా కృషి చేస్తామని డిఆర్‌ఒ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శిలు కె.జగదీష్, ఆర్ శిరీషా, రమేష్, జిల్లా కమిటీ సభ్యులు రాజు , రమణ ,భారతి ,సోమేష్ మరియు నాయకులు రాహుల్, వెంకీ, వాసు, శిరీష తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న విద్యార్థులు

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలి

నగరంలోని బిసి వసతిగృహంలో అనుమానాస్పదంగా మరణించిన ఏడో తరగతి విద్యార్థి కొణతాల శ్యామలరావు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన హాస్టల్ విద్యార్థులు, విద్యార్థి కుటుంబ సభ్యులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం మరణించిన విద్యార్థి మరణం సాధారణమైనది కాదని, ఈ మరణం వెనక ఉన్న అన్ని కోణాలను ప్రభుత్వం వెలికి తీయాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగిన వారం రోజులు ముందు నుంచి విద్యార్థికి వార్డెన్ జానకిరామ్ మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని తెలిపారు. శనివారం రాత్రి కూడా వార్డెన్ విద్యార్థి అంతు చూస్తానని బెదిరించారని, విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐకి తెలియజేశారన్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు విద్యార్థి స్పృహ కోల్పోతే 10 గంటల వరకు ఆసుపత్రికి తీసుకువెళ్లకపోవడం దారుణమని , కక్షపూరితంగానే వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. గతంలో ఈ వార్డెన్ వేధింపులకే పూసపాటిరేగలో ఒక యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఈ మరణం కూడా అటువంటిదే అని తెలిపారు. తక్షణమే ఇన్ని అనుమానాలు ఉన్న ఈ మరణం పై ప్రభుత్వం విచారణ కమిటీ వేయాలని, వార్డెన్ జానకిరామ్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దానితో పాటు విద్యార్థి కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం అందించాలని కోరారు. ఆందోళన అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, కుటుంబసభ్యులు డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తికి వినతి అందజేశారు. డిఆర్‌ఒ స్పందించి విద్యార్థుల దగ్గర స్టేట్‌మెంట్ రికార్డ్ చేయాలని, విచారణ వేగవంతం చేయాలని జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేశారు.



మృతునికి కుటుంబానికి న్యాయంచేయాలని ధర్నా చేస్తున్న హాస్టల్ విద్యార్థులు

పూర్వ ఆర్‌డిఒ భవానీ శంకర్‌పై విచారణ

నలుగురు తహశీల్దార్లపై చర్యలు

జెసిని ఆదేశించిన ప్రభుత్వం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పూర్వ ఆర్‌డిఒ భవానీ శంకర్ పనితీరుపై ప్రభుత్వం విచారణకు, అదే సమయంలో పనిచేసిన నలుగురు తహశీల్దార్లపై చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ సేతుమాధవ్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జెసి అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తికి సూచించింది. వారం రోజుల్లో నివేదిక కూడా సమర్పించాలని పేర్కొంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి జెసి, డిఆర్‌ఒలకు వేర్వేరుగా ఆదేశాలు జారీచేసినట్టు సమాచారం. ప్రభుత్వం చర్యలకు భావిస్తున్న వారిలో భోగాపురం తహశీల్దార్‌గా పనిచేసిన రమణమ్మ, కొత్తవలస తహశీల్దార్ సురేష్, పూసపాటిరేగ తహశీల్దార్ సురేష్, జామి తహశీల్దార్ నీలకంఠరావు ఉన్నారు. వీరంతా అప్పట్లో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు తప్పుడు నివేదిక ఇచ్చి ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో విఫలం చెందారనేది ప్రభుత్వ అభియోగం. ఆర్‌డిఒ భూ సేకరణ విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించలేదనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.

స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పోస్టుల నోటిఫికేషన్ రద్దు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని వివిధ కోర్టుల్లో స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ - సెకండ్ క్లాస్ పోస్టుల్లో నియామకం కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసినట్టు ప్రధాన జిల్లా జడ్జి బి సాయి కళ్యాణ చక్రవర్తి వెల్లడించారు. విజయనగరం జిల్లాలోని బొబ్బిలి, కొత్తవలస, పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరులో ఈ పోస్టుల నియామకం కోసం రెండు నోటిఫికేషన్లు విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్ర హైకోర్టు అదేశాల మేరకు ఈ నోటిఫికేషన్ రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య పిలుపునిచ్చారు. డివిజన్ల వారి పర్యటనకు బుధవారం ఆయన శ్రీకారం చుట్టారు. ఒకటో డివిజన్ ఒకటో నెంబర్ సచివాలయ పరిధిలో పర్యటించి క్షేత్రస్థాయి ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికై సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. లక్ష్మీ గణపతి కాలనీ ప్రాంతంలో వివిధ విభాగాల అధికారులు, సచివాలయ సిబ్బందితో పర్యటించి అనేక అంశాలను ఆయన గుర్తించారు. డివిజన్ పరిధిలో ఖాళీ స్థలాలకు పన్నులు ఎందుకు వసూలు చేయడం లేదని అడ్మిన్ కార్యదర్శులపై మండిపడ్డారు. ఫ్లెక్సీలు, పోస్టర్లు ఎక్కడా లేకుండా తక్షణమే తొలగించాలని ఆదేశించారు. అక్కడక్కడ ఉన్న ఆక్రమిత కార్ షెడ్లను గమనించి వాటిని వెంటనే తొలగించాలన్నారు. గుడిశె లలో ఉన్న వారిని చూసి వారికి ప్రభుత్వ ఇల్లు మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రతి ఇంటికి సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్ లు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. టిఫిన్ దుకాణాల వద్దకు వెళ్లి వారు వినియోగిస్తున్న పాలిథిన్ ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. మరలా నిషేధిత ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే అపరాధ రుసుము వసూలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, టిపిఆర్‌ఒ సింహాచలం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

చెరువులను పరిశుభ్రంగా ఉంచడం మన బాధ్యత

నగర పరిధిలో ఉన్న చెరువులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యమని కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. పూల్‌బాగ్ లోని ప్రేమ సమాజం ఎదురుగా ఉన్న బ్రాహ్మణ చెరువు చెత్తాచెదారాలతో నిండి ఉండడాన్ని చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. వెంటనే చెరువులో ఉన్న చెత్తను ప్రక్షాళన చేయాలని ప్రజారోగ్య సిబ్బందికి ఆదేశించారు. దీంతో బుధవారం మధ్యాహ్నం పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకష్ణ నేతత్వంలో సిబ్బంది జెసిబి సహాయంతో చెరువులో ఉన్న చెత్తాచెదారాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైసిపి అభ్యర్థిగా శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

విజయనగరం ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును అధిష్ఠానం ప్రకటించింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సభ్యులు ఇందుకూరి రఘురాజుపై వైసిపి అనర్హత వేటు వేసింది. దీంతో ఉప ఎన్నిక కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల 4న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో వైసిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడును ఆ పార్టీ ప్రకటించింది. టిడిపి కూటమి మాత్రం ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపికి చెందిన వారే అత్యధికంగా విజయం సాధించారు. మున్సిపల్, ఎంపిటిసి, జెడ్‌పిటిసిలుగా వైసిపి వారే ఎక్కువమంది ఉండడంతో ఆ పార్టీ విజయం తధ్యమని వైసిపి వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక సంస్థల్లో టిడిపికి బలం లేకపోవడంతో తమ అభ్యర్థిని పోటీ పెట్టేందుకు అధిష్టానం వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.



ఉమ్మడి జిల్లాలో ఉన్న 743మంది ఓటర్లు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఉన్న విజయనగరం, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, కురుపాం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో 743మంది ఓటర్లు ఉండగా వారిలో 9మంది మరణించారు. మొత్తం ఓటర్లలో టిడిపి కూటమికి 155మంది ఓటర్లు ఉండగా, వైసిపికి 578మంది ఓటర్లు, ఒక ఇండిపెండెంట్ ఓటరు ఉన్నారు. ఈఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత ఎంపిటిసి సభ్యులు, కౌన్సిలర్లు కొంతమంది వైసిపిని వీడి టిడిపి, జనసేనలో చేరినప్పటికి వైసిపికే మెజారిటీ ఉండడంతో ఆ పార్టీ విజయం నల్లేరు మీద నడకే అని వైసీపీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

నాలుగు సార్లు విజయం సాధించిన శంబంగి

శంబంగి వెంకట చిన అప్పలనాయుడు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1981లో టిడిపిలో చేరిన శంబంగి 1983, 1985, 1994, 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. టిడిపి అభ్యర్థిగా ఆరు సార్లు పోటీ చేసిన శంబంగి మూడు సార్లు విజయం సాధించగా 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి అపజయం పాలయ్యారు. 2019లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2024 ఎన్నికల్లో ఓటమి చెందారు. టిడిపి హయాంలో ప్రభుత్వ విప్‌గా పనిచేసిన ఆయన వైసిపి హయాంలో ప్రోటెం స్పీకర్‌గా పనిచేశారు.

వైసిపి శ్రేణుల్లో ఉత్సాహం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైసిపి అభ్యర్థిగా శంబంగిని ప్రకటించడంతో నియోజకవర్గ వైసిపి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో శంబంగి విజయం ఖాయమని పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు

అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట



ఆరోగ్య పరిరక్షణపై గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా విస్తతంగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపిడిఒలు, తాహశీల్దార్లు, మెడికల్ ఆఫీసర్లతో కలెక్టర్ తమ ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. వైద్యారోగ్యం, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతీ అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించాలని, తమ శాఖలపరమైన కార్యకలాపాలను తనిఖీ చేయాలని సూచించారు. వ్యాధులు ప్రభలకుండా ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని సూచించారు. గుర్ల లాంటి సంఘటనలు మరోసారి జిల్లాలో ఎక్కడైనా పునరావృతం అయితే, సంబంధిత సిబ్బందితోబాటు, అధికారులపైనాచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, కాచి చల్లార్చిన నీటిని తాగడం, చేతులు తరచూ శుభ్రంగా కడుక్కోవడం, వేడి ఆహార పదార్థాలను తీసుకోవడం తదితర ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతీ గ్రామంలో, ప్రతీ వార్డులో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని, వీటిని ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రం నుంచి జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిపిఒ టి.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ బి.ఉమాశంకర్, డిఎల్‌ఒ డాక్టర్ రాణి పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ప్రమోషన్లు ఇవ్వాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో నిబంధనలకు అనుగుణంగా పదోన్నతులు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెఅర్‌సి పట్నాయక్, జెవిఆర్‌కె ఈశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్ల అన్ని సబ్జెక్టులలోనూ మొత్తం పోస్టులలో 70శాతం ఉద్యోగోన్నతులకు, 30శాతం ప్రత్యక్ష నియామకాలకు కేటాయించాలన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో అందుకు విరుద్ధంగా ప్రత్యక్ష నియామకాలకు ఎక్కువ పోస్టులను చూపుతూ ప్రస్తుతం సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎస్‌ఎ తెలుగు ప్రస్తుతం 6 ఖాళీలు ఉండగా 2 మాత్రమే పదోన్నతులకు కేటాయించారని తెలిపారు. ఇంగ్లీష్‌లో 4 ఖాళీలకు గాను 1 మాత్రమే ఉద్యోగోన్నతులకు కేటాయించారని తెలిపారు. తక్షణమే నిబంధనలకు అనుగుణంగా ఖాళీల వివరాలు వెంటనే సరిచేసి సీనియారిటీ జాబితా విడుదల చేసి షెడ్యూలు ప్రకారం ఉద్యోగోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అత్యాచారాల నిరోధక చట్టంపై 8న అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

షెడ్యూల్డ్ కులాల వారిలో ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం పై అవగాహన కల్పించేందుకు ఎల్.కోటలో ఈనెల 8న ఉదయం 10.30గంటల నుంచి ఎపి నేర పరిశోధన శాఖ (ఎపి సిఐడి) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు విశాఖలోని ఎపి సిఐడి అదనపు ఎస్‌పి డాక్టర్ జి. ప్రేమ్ కాజల్ తెలిపారు. షెడ్యూల్డ్ కులాల వారికి తమ హక్కులపై అవగాహన కల్పించడం ద్వారా ఆయా వర్గాల్లో సామాజిక సాధికారత సాధించడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ పాల్గొంటారని తెలిపారు.

'శ్రీచైతన్య'లో రక్తదాన శిబిరం

విజయనగరం టౌన్ : శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ బి. ఝాన్సీలక్ష్మిబాయ్ జన్మదినం సందర్భంగా ఆ కళాశాలలో బుధవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 25 మంది రక్తదానం చేసారు. కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపాల్ కె.శ్రీధర్, ప్రిన్సిపాల్ అర్. శ్రీధర్, ప్రిన్సిపాల్ సిహెచ్‌రాంబాబు, డి.విశ్వేశ్వరరావు, ఎ కె.మధుసూధనరావు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో సత్తాచాటిన గురునాయుడు

జాతీయ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయస్థాయి సివిల్ సర్వీస్ క్రీడా పోటీలకు గడసాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గురునాయుడు సత్తా చాటారు. గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో జరిగిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్ పోటీలలో 400 మీటర్ల పోటీలో ద్వితీయ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించి జాతీయ స్థాయికి అర్హత సాధించారు ఈ సందర్భంగా గురునాయుడుకు వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలిపారు.

క్షేత్రస్థాయిలో మహిళా పోలీసుల పాత్ర కీలకం

పోలీసుస్టేషన్లను తనిఖీ చేసిన ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి- బొండపల్లి, దత్తిరాజేరు

క్షేత్ర స్థాయిలో మహిళా పోలీసుల పాత్ర కీలకమని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. బొండపల్లి, పెదమానాపురం, విజయనగరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్లను ఆయన బుధవారం సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీసు స్టేషను తనిఖీ చేసిన ఆయన పోలీసులు, మహిళా సంరక్షణ పోలీసులు, దత్తత గ్రామాల పోలీసులతో మమేకమై, క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంరక్షణ పోలీసులు, దత్తత గ్రామాల పోలీసు సిబ్బంది పాత్ర క్షేత్ర స్థాయిలో క్రియాశీలకం అని అన్నారు. గ్రామ స్థాయిలో జరుగుతున్న నేరాలు, శాంతిభద్రతల సమస్యలు, బెల్టు షాపులు, గంజాయి వినియోగదారులు, విక్రయదారుల సమాచారాన్ని సేకరించి, సంబంధిత పోలీసు అధికారికి అందించాలని స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలు గురించి, అసాంఘిక కార్యకాపాలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగా సేకరించి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. సైబరు మోసాలు, డిజిటల్ అరెస్టు, గంజాయి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను, రోడ్డు సేఫ్టీ, మహిళా రక్షణకు సంబంధించి ప్రజలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా సైబరు మోసానికి గురైతే 1930కు లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ ఫిర్యాదు చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన భాద్యత మహిళా పోలీసుల పై ఉందన్నారు. గ్రామ పరిధిలో నివసించే పాత నేరస్తులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు, వారు చేస్తున్న వృత్తులు, వారి ప్రస్తుత నడవడిక, జీవన విధానం గురించి పూర్తి సమాచారం తెలుసుకొని, అధికారులకు ఎప్పటికపుడు తెలియజేయాలన్నారు. గ్రామంలో కక్షలు, గ్రూపు తగాదాలు, భూతగాదాలు, కొట్లాటలు, పార్టీ తగాదాలు, నేరస్తుల ప్రస్తుత స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. పోలీసు స్టేషనులో పని చేసే పోలీసు సిబ్బందికి కేటాయించిన దత్తత గ్రామాన్ని వారంలో ఒక రోజు సందర్శించి, గ్రామస్తులతో మమేకమై గ్రామంలో పరిస్థితులను అధికారులకు నివేదించాలన్నారు. గ్రామాల్లో నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి, స్థానికులతో మాట్లాడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా మహిళా సంరక్షణ పోలీస్‌లు, దత్తత గ్రామ పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఆయన పరిశీలించారు. అనంతరం పెదమానాపురం స్టేషన్ వద్ద పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు, గజపతినగరం సిఐ జివివి రమణ, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, ఎస్‌ఐలు యు.మహేష్, కే.లక్ష్మణరావు, ఇతర పోలీసు అధికారులు, ఎంఎస్‌పిలు, దత్తత పోలీసులు పాల్గొన్నారు.



మానాపురం పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐలతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

రెడ్డి రమణ సేవలు మరువలేనివి

చీపురుపల్లి: చీపురుపల్లికి చెందిన సామాజిక కార్యకర్త, ఆశయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రెడ్డి రమణ సేవలు మరువలేనివని సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్ అన్నారు. రెడ్డి రమణ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం రెడ్డి రమణ స్వగృహంలో జిల్లా వ్యాప్తంగా యువజన సంఘాలు, స్థానిక పెద్దలు, స్థానిక యువకులు, కుటుంబీకులు ఆయనకు నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ తుని సెంటర్, సాధన యువజన సంఘం అధ్యక్షులు దుర్గాప్రసాద్ 64వ సారి రక్తదానం చేసి రెడ్డి రమణ సేవలను కొనియాడారు. రెడ్డి రమణ బైక్ లైబ్రరీ ద్వారా గ్రంథాలయాలు లేని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి అక్కడ ఉండే విద్యార్థులకు పుస్తకాలు పంచడం, పుస్తకాలు చదివించడం గ్రంథాలయాల ఆవశ్యకతను నొక్కి చెప్పేవారన్నారు. పిల్లల్లో పుస్తక పఠనం, ప్రపంచ పెరిగేలా ఆయన చేసిన సేవలు గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు ఎస్‌ల రాజు, అబ్దుల్ రవూఫ్, గోపి, అప్పలనాయుడు, గోవిందరావులు పాల్గొన్నారు.

నాయకుల విగ్రహాలకు ముసుగులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

వేపాడ: మండల కేంద్రంలో గల వేపాడ, వల్లంపూడి జంట గ్రామాలలో రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు బుధవారం ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించరా అనే కథనం ప్రజాశక్తిలో వెలువడటంతో స్పందించిన అధికారులు ఎన్‌టిఆర్, వైఎస్ఆర్ విగ్రహాలకు ముసుగులు వేశారు. పత్రికల్లో రాస్తే తప్ప అధికార యంత్రాంగం పనిచేయడా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో కూడా ఇంకా రాజకీయ బ్యానర్లు ఉన్నాయని వాటిని కూడా తొలగించాలని కోరుతున్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు ఇకెవైసి తప్పనిసరి

తెర్లాం: ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు ఇకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలని సిఎస్‌డిటి ఎ. సర్వలత అన్నారు. తన కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో దీపం పథకం- 2 కింద 7,200 గ్యాస్ కనెక్షన్లు ఉండగా 500 మంది ఇకెవైసి చేయించుకున్నారని, మిగిలిన వారు కూడా ఇకెవైసి చేయించుకోవాలని కోరారు. ఆధార్, బ్యాంక్ అకౌంటు కూడా చేయించుకోవాలని తెలిపారు.

ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత వద్దు

బొబ్బిలి: హెచ్‌ఐవి, ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత చూపవద్దని వైద్య ప్రాజెక్టు మేనేజర్ ఎల్.శ్రీకాంత్ బాబు అన్నారు. స్థానిక ఐరిష్ పాఠశాలలో బుధవారం హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని అన్నారు. వీరి పట్ల వివక్షత చూపకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. వివక్షత చూపితే పోలీసులకు, లేదా 1097 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీ

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని 6,7 సచివాలయాల్లో కమిషనర్ కె.అప్పలరాజు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, రెవెన్యూ కలెక్షన్, క్లోరినేషన్, అర్బన్ ఓ సర్వే పై రివ్యూ చేశారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గజపతినగరం: పంచాయతీ అధికారులు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ బి.కళ్యాణి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు మంచినీటి ట్యాంకులను శుభ్రపరచాలని, క్లోరినేషన్ చేయాలని, మురికి కాలువలు, వీధుల్లో బ్లీచింగ్ చల్లాలని పంచాయతీ కార్యదర్శి సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు ముమ్మరంగా చేపట్టాలని అన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఎం.తిరుపతి నాయుడు మాట్లాడుతూ మంచినీటి పరీక్షను ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారి ఐ.సాయి కృష్ణారెడ్డి, డాక్టర్ సుష్మ, జెఇ ఎం.శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి సిహెచ్ సుగుణాకర్ రావు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారు చేయాలి

మెరక ముడిదాం: రాబోవు సిటిజన్లు ఎన్నికల ఓటర్ల జాబితాపై వీఆర్‌ఒలు అందరూ దృష్టి సారించాలని తహశీల్దార్ ఆజాద్ రఫీ తెలిపారు. బుధవారం సాయంత్రం వీఆర్‌ఒలతో ఆయన సమావేశం నిర్వహించారు. పాత ఓటర్ల జాబితా కాకుండా కొత్తది ఏమైనా ఉంటే వాటిని పొందుపరచాలని అన్నారు. గ్రామ సభలలో ప్రజలు నుంచి వస్తున్న అర్జీలను తీసుకొని వాటి సమస్యలు తెలుసుకోవాలని, రీసర్వేలో ఏమైనా లోపాలు ఉంటే వాటిని ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువచ్చి రిపోర్ట్ అందచేయాలని తెలిపారు. సమావేశంలో మండల సర్వేయర్, డిటి, వీఆర్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

రూ.26 కోట్లతో అభివృద్ధి పనులు

రామభద్రపురం: బొబ్బిలి నియోజకవర్గంలో ఈ ఏడాది రూ.26 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ డిఇఇ అప్పారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, కాలువలు వంటి నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ఈసారి పనులు జరిగిన వెంటనే క్వాలిటీ కంట్రోల్ (సీసీ) తనిఖీ చేసిన తరువాత బిల్లులు చెల్లిస్తారని తెలిపారు. పనుల విషయంలో రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఇందులో భాగంగా మండలంలో వివిధ పనులకు రూ.60లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

కారిగొల్లపేటలో బోర్లకు మరమ్మతులు

భోగాపురం: మండలంలోని భోగాపురం పంచాయతీ కారి గొల్లపేటలో రెండు బోర్లను అధికారులు బుధవారం బాగు చేయించారు. దీంతో గ్రామంలో కొంతవరకు తాగునీటి సమస్య తీరింది. కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు మరమ్మతులకు గురైన పైపులైన్లను బాగు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఈ గ్రామంలో గత 20 రోజుల నుంచి బోర్లు పాడవడంతో పాటు పైపులైను మరమ్మతులకు గురవడంతో గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో గ్రామంలోని యువకులంతా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పత్రికల్లో కథనాలు రావడంతో ఇఒపిఆర్‌డి గాయత్రి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ స్పందించి దీనిపై దృష్టి సారించారు.

యాంటీ డ్రగ్ నివారణపై హోర్డింగులు

డెంకాడ: సంకల్పం ప్రోగ్రాంలో భాగంగా జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు డ్రగ్స్ నివారణ చర్యల దృష్ట్యా స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ముఖ్యమైన కూడలిలో భారీ హోర్డింగులను బుధవారం ఎస్‌ఐ ఎ. సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్ రోడ్‌లోను, మండల కేంద్రం డెంకాడ పెట్రోల్ బంకు వద్ద, విజయనగరం వైజాగ్ జాతీయ రహదారి జొన్నాడ, లెండి ఇంజినీరింగ్ కాలేజ్ వద్ద హోర్డింగులను ఏర్పాటు చేశారు. మిగతా ముఖ్యమైన కూడలిలో కూడా హోర్డింగులను పెట్టామని ఎస్ఐ తెలిపారు. వీటి వల్ల కొంతమందికైనా అవగాహన వస్తుందని ఆయన అన్నారు.

8న మాజీ సైనికుల 'క్యాంపు కార్యాలయం'

బొబ్బిలి: స్థానిక పాతకోటలో ఉన్న మాజీ సైనికుల కార్యాలయంలో ఈనెల 8న మాజీ సైనికుల సమస్యలు పరిష్కారానికి క్యాంపు కార్యాలయం నిర్వహించనున్నట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రేవళ్ల కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంప్ కార్యాలయంలో మాజీ సైనికులు, వితంతువులు, వికలాంగులు, వృద్ధులకు ఐడెంటిటీ కార్డులు, డిపెండెంట్ కార్డులు, ఇంటి పన్ను సమస్యలు, భూ సమస్యలు, ఇతర సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. క్యాంపు కార్యాలయానికి జిల్లా సైనిక అధికారి మజ్జి కృష్ణారావు హాజరవుతారన్నారు. ఈ అవకాశాన్ని మాజీ సైనికులు కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటింటి కుళాయిల పనితీరు పరిశీలన

వేపాడ: మండలంలోని కృష్ణరాయుడుపేట గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిల ద్వారా పనిచేస్తున్నాయా? అని బుధవారం ఎంపిపి దొగ్గ సత్యవంతుడు పరిశీలించారు. ఈ పరిశీలనలో గ్రామ సర్పంచ్ సిలువది మునిలి నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.దేవి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులుగా ప్రకాష్

భోగాపురం: మండల విశ్వబ్రాహ్మణ సహకార సంఘం అధ్యక్షునిగా పోలవరపు ప్రకాష్‌ను ఎన్నుకున్నారు. భోగాపురంలోని కళ్యాణ మండపంలో బుధవారం సాయంత్రం మండల కార్యవర్గ సమావేశం జరిగింది. అధ్యక్షునిగా ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా రాపాక సత్తిబాబు, కార్యదర్శిగా కరణం శ్రీరామమూర్తి, కోశాధికారిగా కుప్పిలి నారాయణరావు, ఉప కార్యదర్శిగా అమలాపురం బాబురావుని ఎన్నుకున్నారు. పోలవరపు ప్రకాష్ మాట్లాడుతూ విశ్వ బ్రాహ్మణుల ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు.

ఎమ్మెల్యేకు తెలియకుండా పిపిసిలో నియామకాలు

● సొసైటీ, వ్యవసాయాధికారులను హెచ్చరించిన ఎమ్మెల్యే ● టిడిపి వారు చెబితే ఎలా వేస్తారని ప్రశ్న ● మరోసారి టిడిపి, జనసేన మధ్య వివాదం

ప్రజాశక్తి- డెంకాడ

ప్రొక్యూర్ మెంట్ సెంటర్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సిబ్బంది నియామకాలు స్థానిక ఎమ్మెల్యే లోకం నాగ మాధవికి తెలియకుండా జరగడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు చెప్పకుండా ఎలా సిబ్బందిని నియమిస్తారని ఆమె సొసైటీ, వ్యవసాయాధికారులను నిలదీశారు. టిడిపి నాయకులు చెప్పినట్లు సిబ్బందిని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. తనకు కనీసం సమాచారం లేకుండా ఇష్టానుసారంగా ఎలా వ్యవహరిస్తారని ఎమ్మెల్యే మండి పడినట్లు తెలిసోంది. దీంతో మరోసారి టిడిపి, జనసేన మధ్య వివాదం తలెత్తినట్లు తెలిస్తోంది.

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా 45 రోజులు పాటు టెంపరరీగా ఉద్యోగాలు చేసేందుకు సొసైటీ ఆధ్వర్యంలో నియామకాలు జరిగాయి.. మండలంలో మూడు సొసైటీల పరిధిలో ఆరు క్లస్టర్‌గా విభజించారు. జొన్నాడ సొసైటీ పరిధిలోని గ్రామాలను ఒక క్లస్టర్ గాను, అక్కివరం ఒక క్లస్టరగాను, డెంకాడ సొసైటీ పరిధిలో ఉన్న గ్రామాలను నాలుగు క్లస్టర్లగానూ ఏర్పాటు చేశారు. అయితే జొన్నాడ సొసైటీ డెంకాడ సొసైటీ పరిధిలో ఒక్కొక్క క్లస్టర్‌లో టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంటర్ ఆపరేటర్, హెల్పర్‌ల ముగ్గురిని ఏర్పాటు చేయాలి. ఇలా 15 మంది వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రస్తుతానికి 12 మంది వరకు నియమించారు. వీరిలో టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.15 వేలు, డేటా ఎంటర్ ఆపరేటర్‌కు రూ.12 వేలు, హెల్పర్‌కు రూ.9,500 జీతంగా 45 రోజులకు గాను ఇవ్వనున్నారు. అయితే ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే లోకం నాగ మాధవికి తెలియకుండా, స్థానిక జనసేన నాయకులకు తెలియకుండా, టిడిపి వారు ఏ పేర్లు చెప్తే వారినే నియమించారు. దీనిపై స్థానిక ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావుకు గాని, ఎమ్మెల్యేకు గాని తెలియకుండా నియామకాలు ఎలా చేస్తారని వ్యవసాయ అధికారులను సొసైటీ అధికారులను ఎంపిపి తన ఛాంబర్‌లో బుధవారం ప్రశ్నించారు. దీనికి సొసైటీ, వ్యవసాయ శాఖ అధికారులు తమకు సంబంధం లేదంటూ తప్పించుకున్నారు. దీనిపై ఎమ్మెల్యే స్వగృహానికి నాలుగు మండలాల సొసైటీ అధికారులను వ్యవసాయ అధికారులను రమ్మని చెప్పారు. అక్కడ సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు చెప్పాలి కదా అని ఎమ్మెల్యే వారిని అడిగితే స్థానిక నాయకులకు చెప్పామని అధికారులు సమాధానం చెప్పారు. దీంతో స్థానిక నాయకులు తన వద్దకు రావాలని, తన వద్దకు రాకుండా వారు చెపితే మీరు ఎలా నియమిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం చివరకు జనసేన టిడిపి మధ్య రగడగా తయారైంది. ఇది ఎటు దారి తీస్తుందో చూడాలి. కాగా కొత్తగా నియామకమైన వారికి బుధవారం శిక్షణ కూడా ఇచ్చేశారు.



ఉద్యోగాల నియామకాలపై సొసైటీ ప్రతినిధులు, వ్యవసాయాధికారులను ప్రశ్నిస్తున్న ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు

ధాన్యం కొనుగోలు ప్రక్రియపై శిక్షణ

పాడి పేక్రూట్మెంట్ సెంటర్ పిపిసి ఖరీఫ్ 2024 సంవత్సరానికి గాను సంబంధించి దాన్యం కొనుగోలు ప్రక్రియపై మండల స్థాయిలో ఆర్‌బికె స్టాఫ్ టిపిసి సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సివిల్ సప్లై అధికారుల ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించారు. రైతులు వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న సమయంలో సెల్‌ఫోన్ ద్వారా రైతులకు సమాచారాన్ని ఇవ్వాలని తెలిపారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా, సొసైటీల ద్వారా తీసుకోవాలన్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా వారికి కావలసిన సమాచారాన్ని ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఈ నిర్మల, సిఎస్‌డిటి శంకర్, ఈవో రామకోటి తదితరులు పాల్గొన్నారు.

పలు రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

68వ ఆంధ్రప్రదేశ్ రాష్ట హాకీ పోటీలకు బొప్పడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దన్నాన జగదీశ్, మీసాల జగదీశ్, కలిశెట్టి భానుప్రసాద్, బమ్మిడి తరుణ్, అంబల్ల హాసిని ఎంపికయ్యారు. వీరు నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు లో అండర్-17 హాకీ పోటీలలో పాల్గొంటారు. వీరితో పాటుగా అండర్-14 విభాగంలో కలిసెట్టి జోస్మి, పతివాడ లావణ్య, బలగ మహాలక్ష్మి, దుర్గాసి యామిని, రెడ్డి ప్రత్యూష, పున్నాన అజయ్, అమర తేజ స్వరూప్ ఈ నెల 8న అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం నగేష్ కుమార్, చైర్మన్ స్వామినాయుడు, సర్పంచ్ అంబళ్ళ కిరణ్ కుమార్, గ్రామ పెద్దలు, వ్యాయామ ఉపాధ్యాయుడు యర్రా సూర్యారావు అభినందించారు.



నెల్లిమర్ల: రాష్ట్ర స్థాయి హాకీకి ఎంపికైన క్రీడాకారులు

రాష్ట స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌కు విద్యార్థులు

మండలంలోని కొండవెలగాడ జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు పీడీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 4 వరకు గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీలల్లో ఎం.లక్ష్మీనారాయణ 49 కేజీల విభాగంలో కాంస్య పతకం, బి.లోకేష్ 65 కేజీల విభాగంలో కాంస్య పతకం సాదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం వి.జ్ఞానశంకర్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మెంటాడ విద్యార్థులు

మెంటాడ: అండర్-14,17 విభాగాలలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మెంటాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విధ్యార్థులు ఎంపికయినట్లు పీడీ టి.శ్రీనివాసురావు తెలిపారు. గత నెల 24వ తేదీన ఎస్.కోటలో జరిగిన జిల్లా స్థాయి అండర్ 14,17 విభాగాలలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో బాల బాలికలు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ అరుణ అభినందించారు. అన్నమయ్య జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో ఎస్ చంద్రమౌళి, జి బోగిరాజు, ఎ. దిలీప్, బి నితిన్, టి.అఖిల్, అండర్-17 బాలికల విభాగంలో కె తనూజ, టి కావ్యలు పాల్గొని తలబడతారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో విజయం సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తేవాలని, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.



మెంటాడ: బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఉపాధ్యాయులను శిక్షించొద్దు

బొబ్బిలి: నిర్బంధ శిక్షణల పేరుతో ఉపాధ్యాయులను మాసికంగా శిక్షించటం సరికాదని అలాంటి శిక్షణలతో ఉపాద్యాయులు మానసిక, భౌతిక, అనారోగ్య సమస్యలతో ఆందోళన చెందుతున్నారని తక్షణమే శిక్షణా తరగతులను రద్దు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఎపిటిఎఫ్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రెసిడెన్షియల్ తరహాలో 6 రోజుల పాటు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహిస్తున్న లీడర్ షిప్ శిక్షణ, ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణలు వల్ల ఉపాద్యాయులు ముఖ్యంగా మహిళలు, దీర్ఘ కాలిక వ్యాధులు షుగర్, బిపి, థైరాయిడ్‌లతో బాధపడుతున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులు అనేక యాప్‌లతో, పని భారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అది చాలదన్నట్లు పాఠశాల నాయకత్వ శిక్షణలు, ఫౌండేషన్, న్యూమరస్ శిక్షణల పేరుతో సుదూర ప్రాంతాల్లో 6 రోజులు రెసిడెన్షియల్ తరహాలో శిక్షణలు నిర్వహించటం సరికాద న్నారు.

ఆసక్తిగా మండల సమావేశం

●ఒకే వేదికపై ఎమ్మెల్యే, మార్క్‌ఫెడ్ చైర్మన్ ●ఎన్నికల కోడ్ అడ్డంకితో ప్రశాంతంగా ముగిసిన సమావేశం

ప్రజాశక్తి - భోగాపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆసక్తి రేపింది. ఇటీవల నెల్లిమర్లలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే లోకం మాధవి, మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మధ్య వివాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తొలిసారి వారిద్దరు ఒకే వేదికపై కూర్చోవడంతో వీరి మధ్య ఏ విషయంపై నైనా చర్చకు దారి తీస్తుందా అని ఆసక్తిగా చూశారు. కానీ ఈ సమావేశానికి ఇరువురు హాజరైనప్పటికీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా ఉండడంతో సమస్యలపై చర్చించలేదు. దీంతో ఈ సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె 2024-25 అంచనా బడ్జెట్ గురించి చర్చించారు. దీనికి సంబంధించిన వివరాలను ఎఒ సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మహిళలపై జరుగుతున్న దాడులు నేపథ్యంలో సఖి కార్యక్రమం ద్వారా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో పక్కాగా నిర్వహించాలని అధికారులకు ఆమె ఆదేశించారు. ఎమ్మెల్యే లోకం మాధవి మాట్లాడుతూ డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా కాలువల్లో ఉన్న తాగునీటి పైపులను తొలగించాలన్నారు. అవసరమైతే మండల పరిషత్ నుంచి దీనికి నిధులు కేటాయించాలన్నారు. బోర్ల వద్దనున్న మురుగు నీటిపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున సమస్యలపై మాట్లాడలేకపోయామని తర్వాత సమావేశంలో చర్చిద్దామని అన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కిరణ్ కుమార్, వైస్ ఎంపిపిలు పడాల సత్యవతి, రావాడ బాబు, తహశీల్దార్ ఎం సురేష్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ వైకుంఠంనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి అనూష రెడ్డి

మార్క్‌ఫెడ్ చైర్మన్‌కు సన్మానం

మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన కర్రోతు బంగార్రాజును మండల పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

సిపిఎం జిల్లా మహాసభ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - కొత్తవలస

సిపిఎం పార్టీ 10వ జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, మద్దిల రమణ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జరగనున్న మహసభలను విజయవంతం చేయాలన్నారు. దేశంలో నిరుద్యోగం అసమానతలు పెరిగాయని, ఉపాధి లేని కారణంగా కొనుగోలు శక్తి పడిపో యిందని చెప్పారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న కార్మికుల పట్ల స్కీమ్ వర్కర్ల పట్ల దుర్మార్గంగా పాలక ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల రైతుల సంఘం జిలా కార్యదర్శి జి. కృష్ణ మూర్తి, ముఠా కళాశీల యూనియన్ సభ్యులు సూరిడ్డి శ్రీను, జక్కాన వెంకటరమణ, దావాల మహేష్, జక్కాన చిన్న, జామి సత్తిబాబు, నాగిరెడ్డి వెంకన్న, గొర్లె కృష్ణ, జక్కాన రమణ, జక్కాన దేముడుబాబు, రావాడ కనకారాజు, ఆటో యూనియన్ నాయకులు అనపర్తి శ్రీను, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

బొబ్బిలి: సిపిఎం పార్టీ 10వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని బొబ్బిలి మండలం రంగరాయపురం గ్రామంలో పోస్టర్ ఆవిష్కరణ మండల కన్వీనర్ ఎస్. గోపాల్ పార్టీ సభ్యులు రెడ్డి త్రినాధ్, ఉడుముల ప్రసాదు నిర్వహించారు. ప్రభుత్వాలు మారిన ప్రజల బతుకుల్లో మార్పు రావడంలేదని ఏ ప్రభుత్వం వచ్చిన ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నారని సిపిఎం పార్టీ మండల కన్వీనర్ ఎస్. గోపాల్ అన్నారు. కరెంటు చార్జీలు రైతులు పండించే పంటకి గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం పరిశ్రమలు మూత నీటి వనరులు పుష్కలంగా ఉండి పేదరికం, వంటి సమస్యలు పరిష్కరించడం లేదని అన్నారు. పాలకులు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ చేసే పోరాటాలకు ప్రజలు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజా శక్తి - పూసపాటిరేగ

విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని వికలాంగ విద్యార్థులు వినియోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారి బి.పాపినాయుడు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ కార్యక్రమం ఉచితంగా నిర్వహిస్తున్నారని మండలంలోని 18 ఏళ్ల లోపు వికలాంగులు ఫిజియోథెరపీ వినియోగించుకుని, భవిష్యత్తులో సాధారణ జీవితాన్ని పొందవచ్చు అని అన్నారు. తల్లిదండ్రులు శారీరక వైకల్యాలు ఉన్న తమ పిల్లలకు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా వికలాంగుల్లో సత్ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుని బి.నీలిమ, సహిత విద్య ఉపాధ్యాయులు నడిపేన బంగారు నాయుడు, ఎం వెంకటేశ్వరరావు, వికలాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఇఒ పాపినాయుడు

రోగ నిర్ధారణలో రేడియాలజీ పాత్ర కీలకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రోగ నిర్ధారణలో రేడియాలజీ పాత్ర చాలా కీలకమని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి అన్నారు. ప్రపంచ రేడియాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ సదస్సునకు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేడియాలజీ అభ్యసించే వారికి విదేశాల్లో ఎక్కువ ఉపాధి అవకాశాలున్నాయన్నారు. విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని, సాంకేతిక సామర్థ్యం, నిర్వహణ తెలుసుకోవాలన్నారు. గౌరవ అతిధిగా పాల్గొన్న ఇఎస్ఎల్ బార్క్ హెడ్ డాక్టర్ పి.పద్మ సావిత్రి మాట్లాడుతూ రేడియాలజీ దినోత్సవం అవగాహన కల్పించడానికి ఉపయోగపడుతుందన్నారు.

మరో అతిధి ఆల్ఫా స్కాన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రాజశేఖర్ రేడియాలజీ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కాశీ ఆసుపత్రి రేడియాలజిస్ట్ వినోద్ నాయుడు, బార్క్ శాస్త్రవేత్త డాక్టర్ హిమజ, హోమి బాబా క్యాన్సర్ ఆసుపత్రి శాస్త్రవేత్త రమణమూర్తి అతిధులుగా పాల్గొని ప్రసంగించారు. ఐక్యూఎసి హెడ్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, డీన్ డాక్టర్ విజయ్ బాబు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టేకు చెట్లు మాయంపై దర్యాప్తు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని చామలాపల్లి రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్లు 66, 67 సబ్ డివిజన్‌లో ఉన్న ఎస్‌సి కార్పొరేషన్ భూముల్లో లక్షలు విలువ చేసే టేకు చెట్లు మాయంపై తహశీల్దార్ రాములమ్మ, అటవీ శాఖ అధికారులు బుధవారం దర్యాప్తు చేపట్టారు. జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం భూమి అభివృద్ధి పథకం ద్వారా ఇచ్చిన భూముల్లో 50 భారీ టేకు చెట్లను ఏ విధమైన అనుమతులూ లేకుండా రాత్రి బాగాన నాలుగు లారీలతో తరలించినట్లు వచ్చిన సమాచారం మేరకు తహశీల్దార్ రాములమ్మ, అటవీశాఖ అధికారులు, ఉప తహశీల్దార్ డి సన్యాసినాయుడు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మి, మండల సర్వేయరు, సచివాలయ విఆర్‌ఒ క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేశారు. ఇప్పటికే వల్లంపూడి పోలీస్ స్టేషన్‌లో టేకు చెట్లు అక్రమ తరలింపుపై విఆర్‌ఒ ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఈ భూములు వివాదం కొత్తవలస కోర్టులో పెండింగ్ ఉందని, కోర్టులో వివాదం నడుస్తున్న భూముల్లో ఏ విధమైన అనుమతులూ లేకుండా టేకు చెట్లు మాయంపై దర్యాప్తు నివేదిక అందిన వెంటనే పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టుకు కూడా తెలియ జేశామని తహశీల్దార్ రాములమ్మ తెలిపారు.



చెట్లును పరిశీలిస్తున్న తహశీల్దార్ రాములమ్మ, అధికారులు

రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి

తల్లికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని సవరవల్లి సమీపంలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి చెందగా తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. విశాఖ జిల్లా పద్మనాభ మండలం పాండ్రంకి గ్రామానికి చెందిన కర్రి సూరిబాబు(40) మృతి చెందగా ఆయన తల్లి సంతోషికి తీవ్ర గాయాలయ్యాయి. సవరవల్లి వైపు నుంచి తగరపువలస వైపు బైక్ పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న సూరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందర పేట ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్వారీ విధులకు ఆటంకం కల్పించిన రైతులపై కేసు నమోదు

ప్రజాశక్తి -వేపాడ

మండలంలోని వావిలపాడు పరిధిలో రాతి క్వారీ పనులకు రైతులు ఆటంకం కల్పిస్తున్నారని యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో వల్లంపూడి ఎస్ఐ బి దేవి ఇరువురి రైతులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక లాభాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

పంటల సాగులో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి వెంకటయ్య తెలిపారు. మండల పరిధిలోని రొంపల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వివిధ పంటల సాగులో మెళకువలు, ఎరువుల వినియోగం, తదితర వాటిపై సూచనలు, సలహాలు అందించారు. తెగుళ్ల నివారణలో తీసుకోవాల్సిన పద్ధతులు, మొక్కజొన్న సాగుపై వివరించారు. జీడి మామిడి రైతులు ఈ నెల 15లోగా ఎకరాకు రూ.1500 చెల్లించి పంటల బీమా పథకంలో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు లావణ్య, కొండలరావు పాల్గొన్నారు.